www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ఆనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# గుర్తుతెలియని వాహనంతో ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



**పామిడి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-**

పామిడి పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆద్యా రెస్టారెంట్ సమీపాన బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ(40-50) మృతి చెందింది. బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆమె అక్కడకక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్లాక్ కలర్ చీరెపై వివిధ రకాల పూల రంగులతో కూడిన చీరె, బ్లూ జాకెట్ మృతురాలు ధరించి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు అడ్డుకుంటాం

**- ఈనెల 19న 'చలో మెడికల్ కాలేజ్'**
**- పెనుకొండకు రానున్న యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా**
**- వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ స్పష్టీకరణ**



**అనంతపురం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-**

ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తులను నిలువు దోపిడీ చేయడం కోసమే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్ పేరుతో ప్రభుత్వం భారీ స్కాంకు తెరతీస్తోందని వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో యువజన, విద్యార్థి విభాగం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించడంతో పాటు మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు పెంచడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17 కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీపీపీ పేరుతో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తోందని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'చలో మెడికల్ కాలేజి' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని వైసీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు పరిశీలించనున్నట్లు చెప్పారు. పెనుకొండలో జరిగే కార్యక్రమానికి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా హాజరవుతారని.. యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్ర జరుగుతోందని సాకే చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వ తీరును రాజకీయాలకు అతీతంగా అందరూ ఖండిరచాలని కోరారు. "2019 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలు 11 మాత్రమే. వీటిలో 2185 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. వైద్య విద్యకు (మెడికల్ ఎడ్యుకేషన్) రోజురోజుకు డిమాండ్ పెరుగుతుండడంతో చాలా మంది పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య విద్య అనేది అందని ద్రాక్షలా ఉండేది. ప్రైవేట్ కళాశాలల్లో లక్షల రూపాయలు ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే కోర్సుల్లో చేర్పించేవారు. మధ్య తరగతి కుటుంబాల వాళ్లయితే అప్పులు చేసి రష్యా, ఫిలిప్పీన్స్, చైనా వంటి దేశాలకు పంపేవాళ్లు. ఇలాంటి పరిస్థితులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో కొత్తగా 2550 సీట్లు సమకూర్చేలా రూ.8 వేల కోట్లకు పైగా నిధులతో 17 కొత్త కళాశాలల నిర్మాణానికి జగన్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 2023-2024లోనే ఒకే సారి ఐదు కళాశాలలు ప్రారంభించారు. విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల ద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లను అందుబాటులోకి తెచ్చారు. గత ఏడాది పులివెందులకు మంజూరైన అనుమతులను కూడా ఈ ప్రభుత్వం రద్దు చేసింది. మాకు మెడికల్ సీట్లు వద్దు అని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమే. నేడు కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేలా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరం. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో కళాశాలలను, బోధనాస్పత్రులను పెడితే పేదలకు ఉచిత వైద్యం కరువయ్యే అవకాశం ఉంది" అని సాకే చంద్ర తెలిపారు.

**- ఈనెల 19న పెనుకొండకు జక్కంపూడి రాజా**

తన బినామీలు, అస్మదీయులను అడ్డం పెట్టుకుని కారుచౌకగా ప్రభుత్వ సంస్థలను కాజేసే కుట్రను చేస్తున్నారని సాకే చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగమే ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ నిర్వహణకు శ్రీకారం చుట్టడమన్నారు. 2004కు ముందు ఉమ్మడి ఏపీలో గానీ, 2014 నుంచి 2019 వరకు ఎన్డీయే కూటమిలో ఉండి కూడా కనీసం ఒక్క ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు చంద్రబాబు చొరవ చూపలేదని తెలిపారు. గతంలో ప్రైవేట్ మెడికల్ కళాశాలలను ప్రోత్సహించిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 19వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'ఛలో మెడికల్ కాలేజి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి యువజన, విద్యార్థి విభాగం నాయకులంతా శుక్రవారం పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా హాజరవుతారని.. యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు కొనసాగిస్తుందని అని సాకే చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో యువజన విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, విద్యార్థి విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, యువజన విభాగం అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, యువజన విభాగం అనంతపురం నగర అధ్యక్షుడు శ్రీనివాస దత్త, నగర ఉపాధ్యక్షుడు ఉదయ్, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ఆర్‌డీఓ కఠిన ఆదేశాలు

**- ముదిగుబ్బలో పిర్యాదుల పరిష్కారంపై ఆర్‌డీఓ క్లియర్ ఇన్స్ట్రక్షన్స్**

**ధర్మవరం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-**

ముదిగుబ్బ మండలంలో ప్రజా సమస్యలపై ధర్మవరం రెవెన్యూ డివిజినల్ అధికారి (ఆర్‌డీఓ) ఈరోజు ప్రత్యేక పర్యటన చేపట్టారు. ఏ.బీ.బపల్లి తండా, తప్పెటవారిపల్లి గ్రామాల్లో ప్రజా గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) ద్వారా వచ్చిన పలు పిర్యాదులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ సంబంధిత తహసీల్దార్‌ను ఉద్దేశించి"ప్రజా పిర్యాదుల పరిష్కారం నిర్ణీత కాలవ్యవధిలో తప్పనిసరిగా పూర్తి చేయాలి. ఆలస్యం జరిగితే చర్యలు తప్పవు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ముందుండాలి'' అని ఆదేశించారు. ఆర్‌డీఓ ప్రజలకు సూచిస్తూ"మీ సమస్యలను అధికారులకు నిజాయితీగా తెలియజేయండి. మీరు సహకరిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయి" అన్నారు. ఈ పర్యటనలో భూసంబంధిత వివాదాలు, సంక్షేమ పథకాల అమలు, రేషన్ సమస్యలు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తక్షణ పరిష్కారం దిశగా మార్గదర్శకాలు ఇచ్చారు. ప్రజల సమస్యలపై నేరుగా స్పందించిన ఆర్‌డీఓ పర్యటన గ్రామస్థుల్లో విశ్వాసం నింపింది. అధికారులు తరచుగా ఇలా పరిశీలన చేస్తే ప్రజల సమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయని వారు అభిప్రాయపడ్డారు.





# ధర్మవరం రూరల్‌లో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ ఘనంగా నిర్వహించారు

**- మహిళల ఆరోగ్య రక్షణే దేశ బలానికి పునాది**
**- క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు తప్పనిసరిగా చేయించుకోవాలి**
**- మహిళల ఆరోగ్యం కాపాడడమే కుటుంబ సమాజ అభివృద్ధి లక్ష్యం**
**-బయటి ఆహారాలు మానుకుని సాంప్రదాయ ఆహారాన్ని అలవాటు చేసుకోవాలి**
**: హరీష్ బాబు పిలుపు**






**ధర్మవరం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల ప్రకారం, ధర్మవరం రూరల్ మండలంలోని నిమ్మలకుంట గ్రామ పిహెచ్‌సి లో "స్వస్థ్ నారీ %-% సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు అనేక అభియాన్లు జరుగుతున్నాయని తెలిపారు. వాటిలో భాగంగానే మహిళల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ స్వస్థ్ నారీ %-% సశక్త్ పరివార్ అభియాన్ ను మధ్యప్రదేశ్ లో ప్రారంభించారని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో స్త్రీమూర్తికి ఉన్న గౌరవం ప్రపంచంలో మరెక్కడా లేదని, మహిళల ఆరోగ్యం కాపాడటంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అధిక రక్తపోటు, మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులను నిరోధించాలంటే క్రమం తప్పకుండా స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలని, ఏ వ్యాధినైనా భయపడకుండా తొలిదశలో గుర్తిస్తేనే సమర్థవంతంగా చికిత్స చేయగలమని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లా నాయకత్వంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినప్పటికీ, మహిళలు ఇంకా ముందుకు రావడంలో వెనుకంజ వేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఎవరు కూడా భయపడకుండా స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవాలని మహిళలకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. అలాగే బయట ఆహార పదార్థాల వలన అనేక రకాల రోగాలు వస్తున్నందున, మన పాత సాంప్రదాయ ఆహార అలవాట్లను పాటించడం ద్వారా అనారోగ్యాన్ని దూరం పెట్టవచ్చని హరీష్ బాబు సూచించారు. తరువాత దర్శినమల గ్రామ పిహెచ్‌సి లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి సందేశాన్ని వర్చువల్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది, రూరల్ అధ్యక్షులు చంద్ర, నిమ్మలకుంట శ్రీనివాసులు, శినా, హరి యదవ్, పోతుకుంట రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి ని కలిసిన వీ ఆర్ ఆర్



**తాడిపత్రి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-**

తాడిపత్రి మాజీ సమన్వయ కర్త వీఆర్ రామిరెడ్డి తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి తో భేటి అయ్యారు. బుధవారం జరిగిన ఈ భేటీలో తాడిపత్రి నియోజక వర్గంలోని పలు విషయాలపై చర్చించినట్లు విశ్వసనీయమైన సమాచారం. నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు కార్యాచరణ తదితర అంశాలపై వైయస్ జగన్మోహన్ రెడ్డి విఆర్ రామిరెడ్డి కూలంకుషంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ కలయిక తాడిపత్రి నియోజక వర్గంలోని వైసిపి కార్యకర్తలకు, రాజకీయ విశ్లేషకులకు అంతుచిక్కని వైవహారంలా తయారైంది.

# సేవ్ ఆర్డిటీ - ఫెర్రేర్ సేవలను కాపాడండి




కనేకల్,సెప్టెంబర్1. అక్షర టైమ్స్:-

కనేకల్ మండల కేంద్రంలో సేవ్ ఆర్ డి టీ కార్య క్రమం లో బాగంగా వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో మహిళలు,గ్రూప్ లీడర్లు,నెట్ వర్క్ లీడర్లు,సిడిసి మెంబర్లు,సంఘం ఉపాద్యాయులు, నినాదాలతో సేవ్ ఆర్ డి టీ ఎఫ్ సి ఆర్ కేంద్ర ప్రభుత్వం వెంటే రెన్యువల్ చేయాలని,ఎంతో మంది పేద ప్రజలు,విద్య ఆరోగ్య,వైద్య పరంగా ఆర్ డి టీ నుండి లబ్ధి పొందుతున్నారని,అలాంటి సేవలు లేకుండా ఎఫ్ సి ఆర్ నిలుపుదల చేయడం చాలా బాధాకరం అని నినాదాలు చేస్తూ అంబేద్కర్ కూడలి నుండి ఊరేగింపుగా మండల పరిషత్ కార్యాయంలో జడ్పీటీసీ మెంబర్ పద్మావతి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యార్రగుంట గ్రామం నుండి పెద్ద ఎత్తున సి డీ సి మెంబర్లు,మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలు



పామిడి,సెప్టెంబర్17.అక్షర ట్రైన్స్:-

పామిడి మండల భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు అంజి నాయక్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఆయన పేరు మీద పామిడిలో ఉన్న దేవాలయాల అన్నిటిలోనూ పూజలు అభిషేకాలు అర్చనలు చేయించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు తో పాటు టీడీపీ జనసేన ఆర్ఎస్ఎస్ తదితర పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎద్దులపల్లిలో స్వస్థి నారీ శక్తి పరివార్ అభియాన్

పామిడి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

మండలంలోని ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి హెచ్ సి)లో వైద్యాధికారి డాక్టర్ వి.సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం స్వస్తి నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమము నిర్వహించడమైనది. ముందుగా ఎద్దులపల్లి సర్పంచ్ రమణమ్మ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగినది. ఈ కార్యక్రమం నందు19నుండి 49 సంవత్సరముల మహిళలకు రక్త పరీక్షలు( ఐదు రకాలు) క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడమైనది.అలాగే 13నుండి 19 వయస్సు గల బాలికలకు కిశోర బాలికలకు రక్త పరీక్షలు, ప్రత్యేకంగా హైజిన్ గురించి వివరించడమైనది. అలాగే చిన్నపిల్లలకు వ్యాక్సిన్ వేయడమైనది. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ తులసమ్మ, సూపర్వైజర్లు శ్రీరామిరెడ్డి, సుధాకర,సురేందర్, రాజేశ్వరి, తిరుపాలబాయి, స్నేహ, కృష్ణకుమారి,ఏఎన్ఎంలు సుకన్య, దుర్గ భవాని, మారతమ్మ, మరియు బాబూజీ నాయక్ మరియు హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేసినారు.






# ఈనెల 25 న విజయవాడలో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రక్షించాలి

**- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప**

బుక్కరాయసముద్రం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

ఈనెల 25 న విజయవాడలో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రక్షించాలి, 41 నోటీసు పేరుతో స్టేషన్ బెయిల్ ఇవ్వరాదని, పరిహారం ఇవ్వాలని కోరుతూ బాధితుల ధర్నాను జయప్రదం చేయండి. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప కె వి పి ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఈనెల 25 న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కె వి పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప, జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్, నగర అధ్యక్షులు జీవరత్నం, జిల్లా నాయకులు నాగేంద్ర, అంజినేయులు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా దళిత, గిరిజనులరక్షణ కోసం వచ్చిన ఉద్యమాల ఒత్తిడితో కేంద్రం ఎస్టీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989లో చేసింది. 1995 వరకు చట్టం అమలుకు రూల్సు రూపొందించక పోవడంవల్ల అలస్యం అయింది. ఈ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలుకు 2015లో చట్టాన్ని సవరణ చేసారు. 2016 నుండి అమలోకి వచ్చిన సెక్షన్ 1లో 29 రకాల నేరాలు, సెక్షన్ 2లో 8 రకాల నేరాలను పొందుపర్చారు. 2018లో ఎస్సీ, ఎస్టీ అత్యాచరా నిరోధక చట్టం కింద నమోదు అవుతున్న కేసుల్లో శిక్షలు తక్కువగా ఉన్నాయనే పేరుతో సుప్రీంకోర్టు ఎవరైన కేసు పెటితే పై అధికారి అనుమతి లేకుండా నమోదు చేయకూడదు




అని తీర్పును వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఆందోళనల పల్ల కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సు యధావిధిగా కొనసాగిస్తూ ఆర్డినెన్సు చట్ట సవరణ చేయడంతో పాటు ఎలాంటి పై అధికారి అనుమతి అవసరం లేదని చేసింది. దళిత, గిరిజనులపై దాడి జరిగిన వెంటనే బాధితులు పోలీసు అధికారికి మౌకికంగా ఇచ్చినట్లైయితే అయనే స్వయంగా పిర్యాదును రాసి, వినిపించి, పిర్యాదుదారుని సంతకం తీసుకొని పుస్తకంలో నమోదు చేయాలి. ఎఫ్.ఐ. అర్ను పిర్యాదుదారునికి ఇవ్వాలని రూల్సో ఉంది. పోలీసులు అలసత్వంవల్ల ఎఫ్.ఐ.ఆర్ నమోదుకు కూడా జిల్లాలలో పోరాడాల్సి వస్తున్నది. ఎమ్మెల్యేలు జోక్యం ఎక్కువ అయ్యి కేసులు నమోదును కూడా శాసిస్తున్నారు. అనంతపురము నగరానికి చెందిన గిరిజన విద్యార్థిని హత్య లాంటి అనేకం కెవిపిఎస్, ఇతర సంఘాల ఆందోళనలతో కేసులు నమోదు అవుతున్నాయి. కేసులను నిర్వీర్యానికి దళితులపై కొత్త రకమైన మానసిక దాడికి పూనుకుంటున్న పోలీసు యంత్రాంగం గత 16 నెలలుగా జిల్లాలో దళితులపై దాదుల, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయి. రక్షణగా ఉన్న అత్యాచార నిరోధక చట్టం అమలు సక్రమంగా అమలు చేయకపోగా నిర్వీర్యానికి పోలీసు యంత్రాంగం కొత్తరకమైన మానసిక దాడిని ఎంచుకున్నారు. అదే కౌంటర్ కేసులను పెట్టడం, పెట్టుతామని బెదిరించడం, ముందే పెద్ద మనుషులతో అగ్రవర్ణాలతో మాట్లాడకొని రమ్మని అలస్యం చేయడం, ఒత్తిడి చేస్తే కేసును నమోదు చేసి కౌంటర్ కేసులల్లో దళితులు, గిరిజనులకు చెందిన సంఘటనతో ప్రమేయం లేకున్న వారిపై పెట్టడం పెరిగింది. దళితులపై దాడుల చేసిన వారిపై కేసులు నమోదు చేయాలంటే ఎమ్మెల్యేల సిఫార్సులు ఉండాలనే కొత్త సాంప్రాదాయన్ని తెర మీదకు తెచ్చిన ఘనత మన జిల్లా పోలీసులకు చెందుతుంది. రాజకీయ జోక్యం పెరగండంతో పాటు కొద్ది మంది పోలీసులు అధికారులు ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం వెంపర్లాడుతూ దళితుల మీద కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు నిర్వీర్యం చేయడం మానవ హక్కులకు ద్రోహం చేయడమే అవుతుంది. ఎస్.ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, కౌంటర్ కేసులు కట్టడం ఆపాలి. దళితులపై జరిగిన దాడుల ఘటన కేసుల్లో చట్టాన్ని నిర్వీర్యం చేసే రాజకీయ జోక్యం ఆపాలి. స్టేషన్ బెయిల్ ఇచ్చే 41 ఎ నోటీసుల విధానాన్ని ఆపాలని కోరుతూ ఈనెల 25 న విజయవాడలో జరిగే బాధితుల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.

# సెప్టెంబర్ 30 తారీకు ఈ పంట నమోదు చేసుకోవాలి

**- కార్యక్రమం లో జిల్లా వ్యవసాయధికారిణి ఉమామహేశ్వరమ్మ**

**- మండల వ్యవసాయధికారి శ్యాం సుందర్**

బుక్కరాయసముద్రం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

మండలములో రైతులు సాగు చేసిన పంటలను ఈ నెల 30 వ తారీకు లోగ నమోదు చేయుంచుకోవాలని జిల్లా వ్యవసాయధికారిణి తెలియజేసారు. రైతులు తమ పొలం లో వేరుశనగ, కంది ఆముదం వరి మొక్కజొన్న మొదలగు వ్యవసాయ పంటలే కాకుండా ఉద్యానపంటలయున అరటి చీని దానిమ్మ అల్ల నేరేడు మొదలగు పంటలను ఆకు కూరలు కూరగాయలు పూలు మొదలగు సాగు చేసిన పంటలను రైతుకు తమ గ్రామములలోని రైతు సేవ కేంద్ర సహాయకులను కలిసి నమోదు చేయుంచుకోవాలని తెలియజేసారు. 2025-26 వ సంవత్సరపు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రెండవ విడత అక్టోబర్ నెలలో ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నదని ఈ కె వై సి మరియు ఎన్ పి సి ఐ చేసుకొని రైతులు ఆధార్ అకౌంట్ నెంబర్ మొబైల్ నెంబర్ తమ ఖాతాలకు లింక్ చేయుంచుకోవాలని తెలియజేసారు. రేపటి నెలలో వ్యవసాయ యంత్రీకరణ పరికరాలను, డ్రోన్ స్ప్రేయర్ లను, మినీ ట్రాక్టర్ లను ప్రభుత్వం సబ్సిడీ పైన విడుదల చేస్తున్నదని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.



కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి మాట్లాడుతూ కొన్ని గ్రామముల రైతులకు మొక్క జొన్న విత్తే పరికరాలను, రబి సీజన్లో గ్రూప్ కింద రైతులకు ఉచితంగా ఉద్దులు, మొక్కజొన్న విత్తనాలను సరఫరా చేస్తామని తెలియజేసారు ఆ తరువాత మొక్క జొన్న విత్తే పరికరం ప్రదర్శించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయధికారి శ్యాం సుందర్, గ్రామ ఉద్యాన సహాయకురాలు విజయశాంతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మించి వీధి నివాసుల ఇక్కట్లు తీర్చి ఆరోగ్యాలను కాపాడండి




పామిడి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని నెహ్రూ నగర్ లోని చివారున గల నూతన ఈద్గా వెనుక భాగంలో ఉండే సిహెచ్ ఐ చర్చి వీధిలో సిసి రోడ్డును డ్రైనేజీ నిర్మించి వీధి నివాసుల ఇక్కట్లను తీర్చి,ఆరోగ్యాలను కాపాడవలసినదిగా ఆ వీధి నివాసకులు బుధవారం ఎంపీడీవో తేజోష్ణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నివాసకులు మాట్లాడుతూ వీధి మురికి నీరు తడి పొడి చెత్త చతారంతో దుర్గంధం వెదజల్లుతూ ఉంటుందని, దోమలు ఈగలు కీటకాలు పందులు స్వైర విహారం చేస్తున్నాయని,వాటి వల్ల నిరుపేదలైన కుటుంబాల వీధి నివాసకులు అనారోగ్యాలకు గురి అవుతున్నాయన్నారు. ఇందుకు ఎంపీడీవో తేజష్ణ స్పందించి సీసీ రోడ్డు డ్రైనేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

# దివ్యాంగుల హక్కుల చుట్టం పుస్తకావిష్కరణ

పామిడి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-



ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో 2016న వికలాంగుల హక్కుల చట్టం తెలుగు అనువాదం పుస్తకాన్ని బుధవారం పామిడి మండలం పోలీస్ స్టేషన్లో సిఐ యుగంధర్ చేత, ఆ తర్వాత తహసిల్దార్ షర్మిలచేత, పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం ఆవిష్కరించడం యొక్క ముఖ్య ఉద్దేశం వికలాంగుల పట్ల చాలాచోట్ల అనేక దాడులు, దౌర్జన్యాలు మహిళా వికలాంగుల పట్ల అత్యాచారాలు వంటివి ఎక్కువ జరుగుతూ ఉండడం పట్ల వికలాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 92 ప్రకారం వెంటనే ఎఫ్ఐఆర్ కట్టి కేసు నమోదు చేసే విధంగా చట్టంలో రూపొందించబడిందని,ఈ విషయమై సీఐ యుగంధర్ తో మాట్లాడి వికలాంగులకు ఎటువంటి అన్యాయం జరిగిన సానుకూలంగా స్పందించాలని అసోసియేషన్ తరఫున కోరడం జరిగిందన్నారు.స్పందించిన సిఐ మీరు ఎప్పుడన్నా ఫోన్ చేయండి మీకు అందుబాటులో ఉండి మీకు సత్వర న్యాయ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండల మెజిస్ట్రేట్ తహసిల్దార్ షర్మిల దివ్యాంగులకు అండగా తోడ్పాటుగా ఎల్లకాలం సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాకె ఆంజనేయులు, మహిళ అధ్యక్షురాలు వడ్డే లక్ష్మి దేవి, మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, మైనార్టీ నాయకుడు రసూల్ వికలాంగుల సహాయకుడు సుధాకర్ తో పాటు పామిడి మండల వికలాంగుల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు సర్వేశ్ కమిటీ సభ్యులు శివన్న, ఆకుశిరీష,నరసింహులు, ప్రకాష్, నాగభూషణ తదితర దివ్యాంగులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై ఆకస్మిక తనిఖీ చేసిన సీఈఓ




పామిడి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలోవున్న సత్త నుండి సంపద కేంద్రంను బుధవారం సీఈవో ఉదయం 8 గంటలకే అకస్మికతనిఖీ నిర్వహించారు. తదుపరి గ్రామంలోని వీధులు డ్రైనేజీలు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, క్లాస్ మిత్ర వర్కర్లు సత్యనారాయణ సుబ్బరాయుడు నాగరాజుల పనితీరుపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈవో నాగరాజు,ఎంపీడీవో తేజోష్ణ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ఇంటిలోని తడి పొడి చెత్తను పంచాయతీ వారి దొబ్బడి బండ్లు వచ్చినప్పుడు వాటిలో వేయాలని, డ్రైనేజీలో మురికి నీరు నిల్వ ఉండకుండా పారేటట్లుగా ఉంచుకోవాలన్నారు.ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రముగా ఉండేటట్లు చూడాలని,లేకుంటే సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి అన్నారు. ప్రధానంగా దోమల బెడద తగ్గుతుందని, దోమల వల్ల గజ్జి తామర మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ మెజుదు వాపులాంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రాప్తిస్తాయన్నారు. సీఈవో నాగరాజు, ఎంపీడీవో తేజోష్ణ, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, గ్రామ సర్పంచ్ రమణమ్మ,క్లాస్ మిత్ర వర్కర్లు సుబ్బరాయుడు సత్యనారాయణ నాగరాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన బిజెపి మండల అధ్యక్షులు భూమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

బుక్కరాయసముద్రం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన సందర్భంగా అనంతపురం నగరంలో బిజెపి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం స్థానిక గడియార స్తంభం దగ్గర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కణంపల్లి చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న బుక్కరాయసముద్రం మండల అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి మోడీ మీద అభిమానంతో రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా చందమోహన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో 2014 లో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యాక దేశ ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడిగా, ఒక సేవకుడిగా పనిచేస్తున్నారని, భారతదేశాన్ని ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలిచే విధంగా వారు కృషి చేస్తున్నారని, ప్రపంచ దేశాలు అతలాకుతులమవుతున్న సందర్భంలో 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం మాత్రం నరేంద్ర మోడీ నాయకత్వం గత 12 సంవత్సరాలుగా ఆదరిస్తున్నారని, ప్రపంచ దేశాలు అంతా కూడా నరేంద్ర మోడీ గారి సలహాలు తీసుకుంటున్నారని ఇలాంటి ప్రధానమంత్రి మనకు ఉండడం మన అందరి అదృష్టం. వారికి తోడుగా మనందరం కూడా నిలబడాలని వారు విలేకరుల సమావేశంలో తెలిపారు.



# కేక్ కటింగ్ నుంచి మొక్కల నాటకం వరకు -ముదిగుబ్బలో మోడీ బర్త్‌డే వేడుకలు

ముదిగుబ్బ,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లి గ్రామంలో అపూర్వ ఉత్సాహంతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మండల ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని వేడుకలను మరింత ఉత్సాహవంతంగా మార్చారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల ఆనంద కేరింతలు మార్మోగాయి. అనంతరం పాఠశాల ఆవరణలో పచ్చదనం కోసం మొక్కలు నాటడం జరిగింది. "ప్రతి ఇంట ఒక చెట్టు %-% ప్రతి విద్యార్థి ఒక వృక్షం నాటాలి" అని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ, శుభ్రమైన గ్రామాలు నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీపీ పిలుపునిచ్చారు. ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ:"దేశ సేవలో మోడీ అంకితభావం అందరికీ స్ఫూర్తి. ఆయన ఆచరణలో చూపిన క్రమశిక్షణ, కష్టపడే తత్వం ప్రతి విద్యార్థి జీవితంలో ఆదర్శం కావాలి. భవిష్యత్తు భారతదేశం యువత చేతుల్లోనే ఉంది" అన్నారు. తరువాత సుమారు 300 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా రంగానికి



అండగా నిలుస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ :"మోడీ జన్మదినాన్ని కేవలం ఉత్సవంగా కాకుండా సేవా దినోత్సవంగా భావించాలి. సమాజంలో పేదల కోసం, విద్యార్థుల కోసం, పర్యావరణం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం నిజమైన నివాళి అవుతుంది" అని పిలుపునిచ్చారు. విద్యార్థులందరికీ మిఠాయిలు పంచిపెట్టగా, గ్రామ పెద్దలు మోడీ నాయకత్వాన్ని కొనియాడారు. బీజేపీ మరియు ఎన్డీఏ కూటమి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కార్యక్రమం ప్రజా వేదికలా మారింది. మొత్తం వేడుకలో దేశభక్తి గీతాలు, నినాదాలు, విద్యార్థుల ఉత్సాహం అందరినీ ఆకట్టుకున్నాయి. చివరగా పాల్గొన్న వారందరికీ ఎంపీపీ ధన్యవాదాలు తెలిపారు.

# అధిక వడ్డీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు టూ టౌన్ సీఐ రెడ్డప్ప

- గొడవలకు మాదకదవ్యురాలకు దూరంగా ఉండాలి




ధర్మవరం,సెప్టెంబర17.అక్షర టైమ్స్:-

ఇందిరమ్మ కాలనీ యందు ప్రజలతో మీటింగ్ ఏర్పాటు చేసి వారికి చైల్డ్ మ్యారేజ్ సైబర్ క్రైమ్ డయల్ 100, కొత్త వ్యక్తుల రాకపోకల గురించి వారి యొక్క అడ్రస్ గురించి మరియు కుటుంబాల మధ్య తగాదాల గురించి, అధిక వడ్డీలు గురించి,, ఏమైనా సమస్యలుంటే వెంటనే ధర్మవరం టూ టౌన్ పోలీస్ వారిని సంప్రదించాలి లేక డయల్ 100కు కాల్ చేసి మీ యొక్క గ్రీవెన్స్ ను చెప్పవచ్చు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిరోజు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీసుల సహకారం ఎప్పుడూ ఉంటుందని సీఐ రెడ్డప్ప తెలిపారు.

# అపరిచిత వ్యక్తులతో సంబంధాలు ఉండకూడదు

- వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్



ధర్మవరం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

అపరిచిత వ్యక్తులతో సంబంధాలు ఉండకూడదని వన్టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ఎల్సికేపురం ఏరియా నందు సిబ్బందితోపాటు కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సమస్య ఆత్మక వ్యక్తుల ఇళ్ళను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. అనంతరం ప్రజలతో వారు మాట్లాడుతూ నూతన వ్యక్తులతో పరిచయాలు పెట్టుకుంటే నష్టమే తప్ప లాభాలు ఉండవని తెలిపారు. చర్చ పరిధిలోనే ప్రజలు జీవించాలని తెలిపారు. పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఏ సమస్య వచ్చినా సరే పోలీస్ స్టేషన్ కు సంప్రదించవచ్చునని తెలిపారు.

# గ్రామీణ ఆరోగ్య విప్లవానికి నాంది

- ముదిగుబ్బలో 'స్వస్థ నారి - శక్తి పరివార్'






ముదిగుబ్బ,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఆవిష్కరించిన 'స్వస్థ నారి %-% శక్తి పరివార్ అభియాన్' కార్యక్రమం ముదిగుబ్బ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ప్రారంభమైంది. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ శ్వేతా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి తుమ్మల మనోహర్, గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి లక్ష్మీదేవి చంద్రాయుడు, స్థానిక సిఐ శివరాముడు, ఈఓఆర్డీ దివాకర్, మండల విద్యాధికారి రమణప్ప తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా మరియు శిశు అభ్యుదయ శాఖ సంయుక్తంగా ఈ అభియాన్‌ను అమలు చేస్తున్నాయి. మహిళలు, బాలికలు, చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్షకు పైగా ఆరోగ్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించారు. ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అక్టోబర్ 2 వరకు ప్రతిరోజూ ఆరోగ్య శిబిరాలు నిర్వహించబడతాయి. వీటిలో నివారణాత్మక, ప్రోత్సాహక, చికిత్సాత్మక సేవలు అందించబడుతున్నాయి. పోషణ మాసంలో భాగంగా ఆంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార అవగాహన, రక్తహీనత నివారణ, మాసిక ధర్మ పరిశుభ్రత, పౌష్టికాహార సూతి ప్రదర్శనలు జరుగుతున్నాయి. అనీమియా, క్షయవ్యాధి, సికిల్ సెల్ వంటి ప్రధాన వ్యాధుల స్క్రీనింగ్, గుర్తింపు, చికిత్సలకు లింకులు బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆరోగ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నారు. గర్భిణీ స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, జీవనశైలి మార్పులు, మానసిక ఆరోగ్యం, అధిక బరువు నివారణ, స్వచ్ఛంద రక్తదానం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. స్థానిక వైద్యులు, ఐసిడిఎస్ అధికారులు, గ్రామస్థాయి ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల చురుకైన భాగస్వామ్యంతో ముదిగుబ్బలో ప్రారంభమైన ఈ అభియాన్, గ్రామీణ ఆరోగ్య విప్లవానికి నాంది పలికిందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# "సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిపై దాడి, కఠిన చర్యలు డిమాండ్ చేసిన సిపిఎం" నేతలు

- "ప్రజా సమస్యలు అడిగితే దాడులా?
- బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి"




ముదిగుబ్బ,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.ఎస్. వెంకటేశ్వర్‌పై నిన్న జరిగిన దాడి ముదిగుబ్బలో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఈ ఘటనపై బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించగా, నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడిని తీవ్రంగా ఖండించారు. డ్వాక్రా మహిళలకు సంబంధించిన ఎనిమిది లక్షల వాహ అంశంపై ప్రశ్నించడానికి వెళ్లిన సిపిఎం నాయకులపై దాడి చేయడం పూర్తిగా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. "ప్రజల సమస్యలపై పోరాడే నాయకులపై దాడి జరగడం అంటే ప్రజల గొంతుకను మూయించడమే" అని నేతలు విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన సిసి రవీంద్ర, బుక్లెట్ నాగరాజులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, విధులనుంచి తప్పించాలని బహిరంగంగా డిమాండ్ చేశారు. "అధికారులు కఠినంగా స్పందించకపోతే, ఇటువంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతాయి. ఇది కేవలం వ్యక్తులపై దాడి కాదు, ప్రజాస్వామ్యంపై దాడి" అని నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, రైతు సంఘం నాయకులు పోతులయ్య, సిఐటియు కో-కన్వీనర్ ముస్తఫా, నౌషాద్, అల్లా బకాష్, రిక్షా ముస్తఫా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# కట్టకిందపల్లిలో పట్టపగలే దొంగతనం

బత్తలపల్లి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో బుధవారం పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కట్టకిందపల్లి గ్రామానికి చెందిన చల్లా రామానాయుడు ఇటీవలనే మృతి చెందాడు. ఆయన భార్య రామాంజినమ్మ ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. కుమారుడు రాజేష్ అనంతపురంలో డ్రిప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రామాంజినమ్మ ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లింది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న మూడు తులాలు( చైను, జత కమ్మలు, తాళిబొట్టు). రూ.26వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి ఇంట్లో చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భారతదేశ అభివృద్ధి ప్రధానమంత్రి మోడీతేనే సాధ్యం..

- రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ సంకారపు నరసింహులు



ధర్మవరం,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

భారతదేశ అభివృద్ధి ప్రధానమంత్రి మోడీతోనే సాధ్యమవుతుందని రిటైర్డ్ కంటి వైద్యాధికారి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సంకారపు నరసింహులు , రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు సంకారపు జయ శ్రీ తెలిపారు. అనంతరం వారు ప్రధానమంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో దాదాపు 150 మంది రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిసిహెచ్ఓ మధుసూదన్ కూడా పాల్గొని ఈ కార్యక్రమం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వైద్య చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం నిజంగా శుభదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ తిపేంద్ర నాయక్ తో పాటు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# "నూతన కమిటీ జర్నలిస్టులకు ఘన సత్కారం

- ఆర్య వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ
- ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులు మహేష్ ప్రశంసలు"

ముదిగుబ్బ,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

ముదిగుబ్బ మండల జర్నలిస్టుల నూతన కమిటీకి ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు క్రిష్ణం మహేష్‌లు బుధవారం సాయంత్రం శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ:"జర్నలిస్టులు ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ సమాజానికి అద్దం పట్టే విధంగా పని చేస్తున్నారు. ప్రజాసేవలో వారి పాత్ర అపూర్వం" అని కొనియాడారు. క్రిష్ణం మహేష్ మాట్లాడుతూ:"అభివృద్ధి పథంలో అధికారులను జాగృతం చేస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేసే పాత్రికేయులు ప్రశంసనీయం. వారి త్యాగభావన సమాజానికి ఆదర్శం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల జర్నలిస్టులు వెంకట్ నాయుడు, ఎన్.సూర్యనారాయణ, కుత్తుబుద్దీన్, జయప్రకాష్, రఘు, మహమ్మద్ అలీ, శేఖర్, ఏ. మల్లికార్జున, పి. నరేష్ బాబు, సిద్ధు, దొడ్డప్ప, రాజేష్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యంగా ఉన్న స్త్రీతోనే బలమైన కుటుంబం : జడ్పీటీసీ కోటి సుధా





బత్తలపల్లి,సెప్టెంబర్17.అక్షర టెన్స్:-

ఒక కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంటుందని, ఇది దేశ ప్రగతికి దోహదపడుతుంది అని జడ్పీటిసి సుధా అన్నారు. బుధవారం స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలందరికీ ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యాధికారి డా. అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ కోటి సుధా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పెషలిస్ట్ డాక్టర్ రోజా రాణి, డాక్టర్ విష్ణువర్ధన్, సిడిపిఓ సరస్వతి తమ సిబ్బందితో ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కోటి సుధా మాట్లాడుతూ, 'ఒక కుటుంబంలో స్త్రీ ఆరోగ్యంగా ఉంటే, ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంటుంది. ఇది దేశ ప్రగతికి కూడా దోహదపడుతుంది' అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ మహిళా వైద్య శిబిరాలను అందరూసద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. డా. అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ శిబిరంలో ముఖ్యంగా అసంక్రమిత వ్యాధులు (బీపీ, షుగర్, క్యాన్సర్), గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, దంత వ్యాధులు, టీబీ, రక్తహీనత వంటి వాటికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిఎంజెఏవై నమోదు, సికిల్ సెల్ అనీమియా పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయని, మహిళలంతా నిర్లక్ష్యం చేయకుండా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 110 మంది మహిళలు చికిత్సలు పొందారు. ఈ కార్యక్రమంలో డా. అరుణ్ కుమార్, డా. విష్ణువర్ధన్, డా. రోజా రాణి, సిడిపిఓ సరస్వతి, జడ్పీటీసీ కోటి సుధా, సిహెచ్ఓ రాజశేఖర్, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాడిమర్రి ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు

తాడిమర్రి,సెప్టెంబర్17.అక్షర టైమ్స్:-

స్వస్థ నారీ స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం లో భాగంగా గురువారం తాడిమర్రి ప్రభుత్వఆసుపత్రి నందుమహిళలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించీ మందులు పంపిణీ చేయడం జరిగింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా రోగులకు బ్రెడ్, అరటిపళ్ళు పంపినీచేయడంజరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నసర్పంచ్ బాలమ్మ, బీజేపీ మండల నాయకులుగోపాలరెడ్డి, బిళ్లే చంద్రమోహన్, డాక్టర్ హరిత, గోవర్ధన్ నాయుడు వైద్య ఆరోగ్య సిబ్బంది బిజెపి నాయకు లు కార్యకర్తలు పాల్గొన్నారు పాల్గొన్నారు

